# ఆశ

**శి**శుపాలుడు అత్తకొడుకు కాబట్టి వంద తప్పుల వరకూ క్షమించాడు శ్రీకృష్ణుడు. మరి అత్త కూతురయితేనూ, స్వంత పెళ్ళామయితేనూ ఏం చేసేవాడంటారు? ఎన్ని అవకాశాలిచ్చేవాడంటారు?

నాకు తెలుసు ఈ ప్రశ్నకు సరైన సమాధానం అందరూ చెప్పలేరు. అబల కాబట్టి, అత్తకొడుకు కన్నా భార్య ఇంకొంచెం దగ్గర కాబట్టీ, వంద కన్నా ఒకటో రెండో ఎక్కువ అవకాశాలివ్వాలని తర్కం చెప్తుందో లేదో కానీ ... వందపైన కాదు, వుట్టి ఒకటీ రెండూ కూడా ఊహించలేమని జీవితాన్ని చదివిన అనుభవజ్ఞులు చెప్తారు. ఆ రోజు జరిగిందదే.

మా వూర్లో మాకో చర్చావేదిక వుంది. కొంతమంది పుస్తక ప్రియులం ఒకచోట చేరి ప్రతినెలా ఒక పుస్తకాన్ని గూర్చో, రచయితని గూర్చో చర్చించుకోవడం ఆ వేదిక వుద్దేశ్యం.

ఆ గ్రూప్‌లో అందరికన్నా చిన్నదాన్ని నేనే. తలేదో, తోకేదో అర్థం కాకుండా మాట్లాడి అవతలివాళ్లని ఇబ్బంది పెట్టేదీ నేనొక్కదాన్నే.

మిగిలినవాళ్ళంతా ఒక్కొక్కరూ ఓ అద్భుతం. "అదికాదండీ!" అంటూ మొదలుపెట్టి సత్యంగారు ఓ ప్రశ్న వేస్తే... ఆ ప్రశ్నలోని వ్యంగ్యానికి ఫక్కుమనే నవ్వూ... 'నిజమే సుమా దీనికేమిటీ సమాధానం!' అనే ఆసక్తీ జంటగా పుడతాయి.

సుదర్శనం గారు మాట్లాడటం మొదలుపెడితే, నింగీ, నేలా, నీరూ కవర్ చేస్తూ... భూత భవిష్యత్ వర్తమానాలకు సమన్వయం చూపుతూ ఒక విషయం మీద వచ్చే సంక్షిప్త సమీక్ష కోసం మనసు చెవులు రిక్కించి వినడం మొదలుపెడ్తుంది.

ఆ తర్వాత మురళీధర్‌గారు ముక్తసరిగా మూడుమాటలు చెప్తే... అప్పటికి అరగంట నుంచీ మన మనసులో గజిబిజిగా కొట్టుమిట్టాడుతున్న భావం మనకు

తెలిసిన తెలుగులో వినబడుతుంది. 'ఇదే... ఇదే దీని వెనుకనున్న అసలు విషయం ఇదే' అంటూ అందరి తలలూ అంగీకారంగా వూగుతాయి.

ఆ రోజు మీటింగ్‌లో వీళ్ళంతా వున్నారు. 'కొల్లాయి గట్టితేనేమి' నవల గురించి చర్చ.

కొల్లాయి గట్టితేనేమి నవలలో చిన్నప్పుడే పెళ్ళయిన హీరో సహాయ నిరాకరణోద్యమంలో చేరగానే... పోలీసు శాఖలో వున్న మామగారితో విభేదాలొస్తాయి.

అప్పటివరకూ కాపురానికి రాని పదిహేనేళ్ళ సుందరిని తెచ్చి ... తనకి అనుకూలంగా మార్చుకోవాలని హీరో రామనాథం చేసే మొదటి ప్రయత్నం ఘోరంగా విఫలమయి, అతను మామగారి చేతుల్లో దెబ్బలు తిని జైలుకి వెళ్ళడం దాకా వస్తుంది.

ఆర్నెళ్ళ తర్వాత జైలు నుంచి వచ్చి మరో ప్రయత్నం చేస్తాడు. "మీ అమ్మా నాన్నా సంగతి కాదు, నీ ఇష్టమేమిటో చెప్పు" అని భార్యని అడుగుతాడు.

కానీ తండ్రి మాటలతో ప్రభావితమయిన ఆ పిల్ల ఈ సత్యాగ్రహితో వెళ్ళడం మూర్ఖత్వమని నిర్ణయించుకుని నేను రానంటుంది.

అంతే, "నేనూ నీకు మళ్ళీ కనబడ"నని హీరో వెళ్ళిపోతాడు. ఆ తర్వాత కొన్నాళ్ళకి తనకి నచ్చిన మరో తోడుని సమకూర్చుకుంటాడు కూడా.

ఇదంతా ఆ రోజు చర్చలో పాల్గొన్న వారందరికీ చాలా సహజంగా, సాధారణంగా అనిపించింది. నాకూ అనిపించేదే నేమో! చివర్లో ఒక సన్నివేశం వుండి వుండకపోతే!

నవల దాదాపుగా పూర్తవుతూండగా... వస్తుంది ఆ సంఘటన. రామనాథంతో సహజీవనం చేస్తున్న స్వరాజ్యం అనే అమ్మాయిని రైల్వేస్టేషన్‌లో అందరిముందూ ఓ పోలీసు అవమానిస్తాడు. భుజంమీద చెయ్యేసి 'స్టేషన్‌కి పద' అంటాడు.

ఆ పోలీస్‌తో రామనాథం గొడవపడుతుండగా.. అక్కడికి అతని మామగారు రావడంతో ఇదంతా ఆయన ప్రోద్బలమేనని రామనాథానికి అర్థమవుతుంది. ఆ తర్వాత ఆయన రివాల్వర్ తీయడం... రామనాథం రొమ్ము విరుచుకుని దానికి ఎదురుగా నిలబడడం... ఆయన రివాల్వర్ దించేసి వెళ్ళిపోతే జనమంతా రామనాథానికి జేజేలు కొట్టడం జరుగుతుంది.

ఈ గొడవంతా అయిపోయాక రామనాథం విశ్లేషించుకుంటాడు. మామగారు స్వరాజ్యాన్ని అవమానించడం వెనక తన తప్పు వుందని అర్థం చేసుకుంటాడు.

రైల్వేస్టేషన్‌లో తామిద్దరూ ఆయనముందు అన్యోన్యంగా తిరగడం... ఆమెకి తాను కిళ్ళీ అందించడం... బుగ్గకి కాటుక అంటితే తుడుచుకునేందుకు రుమాలు అందించడం లాంటి చర్యలన్నీ గుర్తు చేసుకుంటాడు.

తనుకూడా ఒకరకమైన కసితో ఆమెనీ, ఆమెతో సాన్నిహిత్యాన్నీ మామగారి ముందు ప్రదర్శించాననీ... తన వల్లే ఆమె అవమానం పాలయిందనీ అనుకుంటాడు.

మర్నాడు మామగారిని వెతుక్కుంటూ వెళ్ళి ఆమెని తన భార్యగా ఆయనకి పరిచయం చేస్తాడు.

ఇదిగో.. ఇక్కడే నాకు గట్టి సమస్య వచ్చింది. తన అసలు శత్రువైన మామగారి ప్రవర్తననీ... దాని వెనకాల వున్న కారణాన్నీ ఇంత బాగా విశ్లేషించి, ఇంత సున్నితంగా అర్థం చేసుకున్న రామనాథం... తండ్రి మాటలతో భయపడిపోయి, తెగించి భర్తతో బయటికి రాలేకపోయిన భార్యని అర్థం చేసుకోలేకపోవడమేమిటనిపించింది. ఆమెకి కొంత వయసు వచ్చి భర్త విలువ తెలుసుకోగలిగే పరిస్థితి వచ్చేదాకా ఆగకుండా... తన తోడు తాను వెతుక్కోవడమేమిటనిపించింది.

ఇప్పటికి వారమయింది ఆ చర్చ జరిగి. కానీ ఆ విషయం ఇంకా నా మనసుని తొలుస్తూనే వుంది. "రామనాథం అలా ప్రవర్తించడమేమిటి? భార్యని ఆ మాత్రం అర్థం చేసుకోలేక పోవడమేమిటి" అని గింజుకుంటూనే వున్నాను.

అతనలా ప్రవర్తించడమేమిటన్న బాధ ఒక ఎత్తయితే... ఆ ప్రవర్తన సహజంగా వుందని చర్చలో పాల్గొన్న మిగతా వాళ్ళందరూ భావించడం మరొక ఎత్తుగా వుంది.

నిజానికి ఈ విషయంలో నాకూ అనుభవం లేకపోలేదు. భార్యని అర్థం చేసుకోలేని, చేసుకోవాలని ప్రయత్నించని మగవాళ్ళని ఎంతమందిని చూసివుంటాను నేను! వేరెవరో ఎందుకు! ఇంట్లో మా శ్రీవారు లేరూ! నేను శ్రీరామా అన్నా తప్పే ఆయనకి.

'ప్రపంచంలో ఎవరినయినా అర్థం చేసుకుంటాడు కానీ నన్నర్థం చేసుకోడమ్మా మా ఆయన' అంటూ తనూ, తన స్నేహితురాళ్ళూ ఎన్నిసార్లు చెప్పుకుని నవ్వుకోలేదు!

ప్రపంచాన్ని చూసీ, పుస్తకాలు చదివీ నేర్చుకునేదే జ్ఞానమని కొందరంటే... అబ్బే అనుభవించి తెలుసుకునేదే అసలైన జ్ఞానమని మరికొందరంటారు.

ఖర్మకాలి నాకు పాండిత్యమూ, అనుభవమూ రెండూ వున్నాయి ఈ విషయంలో.

నిజమే. మొగుడు పెళ్ళాన్ని అర్థం చేసుకోడు. క్షమించడు. సమస్త ప్రపంచాన్నీ అర్థం చేసుకుంటాడు కానీ పెళ్ళాన్ని అర్థం చేసుకోడు. నా పాండిత్యమూ ఇదే చెప్తోంది. అనుభవమూ ఇదే చెప్తోంది.

అయినా మళ్ళీ రామనాథం భార్యని క్షమించకపోవడం అసహజంగా తోస్తోంది. ఆ రోజు చర్చలో నేను చాలాసేపు ఆ విషయమే పట్టుకు వేళ్ళాడటం తల్చుకుంటే చిరాకుగా వుంది.

అందరూ ఏమనుకున్నారో ఏమిటో? ఇంత సింపుల్ విషయం అర్థం కాదేమిటి? ఈ పిల్లకి... అని మనసులో ఎంత విసుక్కున్నారో!

కానీ... కానీ... రామనాథం సుందరి నిస్సహాయతని అర్థం చేసుకోలేక పోవడమేమిటి?

నేను తల విదిలించాను. లాభం లేదు. ఎంత వదిలించుకుందామన్నా నా ఆలోచన మళ్ళీ ఆ ప్రశ్న దగ్గరికే వచ్చి ఆగుతోంది. వెళ్ళి కాస్త కాఫీ తాగొస్తే నయం.

మీనాక్షికి ఫోన్ చేసి "కాంటీన్‌కి వెళ్దామా!" అన్నాను. "రా!" అంది తను.

లేచి లిఫ్ట్ వైపు నడిచాను. తన కాబిన్ ఫిఫ్త్ ఫ్లోర్. కాంటీన్ సిక్స్త్ ఫ్లోర్.

నేను లిఫ్ట్‌లోనుంచి బయటకి వచ్చేసరికి మీనా కారిడార్‌లో రెడీగా వుంటుందను కున్నాను. లేదు. మెల్లిగా తన కాబిన్‌వైపు నడిచాను. తన ఉద్యోగం కౌన్సిలింగ్ చేయడం. రకరకాల బాధల్లో వొత్తిడుల్లో వున్న స్టాఫ్ కష్టాలు విని సలహాలివ్వడం. అందుకే తన కాబిన్ అందుకు వీలుగా ఓ పక్కగా వుంటుంది.

నేను లోపలికి వెళ్ళగానే మీనా నా వైపు చూసి ఇబ్బందిగా నవ్వింది. "సారీ, ఇప్పుడే ఒక అమ్మాయి ఫోన్ చేసింది. చాలా దుఃఖంలో వుంది. మాట్లాడాలంటే రమ్మన్నాను. కాసేపు వెయిట్ చేస్తావా! నువ్వెళ్ళి కాఫీ తాగేస్తావా!" అంది.

నేను సమాధానం చెప్పబోయేలోపూ మెట్ల దగ్గరనుంచి అడుగుల చప్పుడు వినిపించింది.

తనే నిర్ణయం తీసుకుని "కూర్చో అయితే" అంది మీనా.

నేను బుక్స్ రాక్ పక్కకి తప్పుకున్నాను. ఈ రూమ్‌కి ఒక కార్నర్‌లో ఎక్స్‌ట్రా ప్లేస్ వుండిపోయింది. అక్కడ ఎత్తు తక్కువగా వుండడంతో బుక్స్ రాక్ గోడకి ఆనించకుండా కొంచెం ఇవతలికి పెట్టారు. ఆ రాక్ వెనక ఖాళీ మిగిలిపోయింది.

అక్కడ కూర్చుంటే నేను మీనాకి ఎదురుగా వున్న వాళ్ళకి కనబడను. వాళ్ళూ నాకు కనబడరు.

మా కంపెనీలోని మూడువేలమంది ఉద్యోగుల్లో ఆడవాళ్ళు తొమ్మిదివందల మందీ... అందులో వివాహితలు నాలుగొందలమందీ వుంటారు. వాళ్ళల్లో ఒక అమ్మాయి ఎవరో వచ్చి కూర్చుంది మీనా ముందు.

మీనా తన పద్ధతులలో ఆ అమ్మాయితో మాట్లాడుతోంది. ఆ అమ్మాయి మొదట కొంచెం గంభీరంగా మాట్లాడబోయి.. అంతలోనే రుద్ధమయిన కంఠంతో... ఆ తర్వాత దాదాపుగా ఏడుపు గొంతుతో చెప్పసాగింది.... అంతకు ముందు రోజు రాత్రి భర్త తన మీద చేయి చేసుకున్న వైనాన్ని.

ఇరుక్కుపోయినట్లుగా అయింది నా పని. ఇపుడపుడే తేలేలా లేదు ఇది. అలా అని ఆమె ముందు నుంచి ఇపుడు బయటికి కూడా వెళ్ళలేను. నేనిక్కడ కూర్చున్నానన్న విషయం ఆ అమ్మాయికి తెలియకూడదు కదా!

నా ప్రమేయం లేకుండానే నా చెవులు వాళ్ళ సంభాషణని ఫాలో అవసాగాయి. ఆ అమ్మాయిని ఓదార్చి... మంచినీళ్ళు తాగించి.. మెల్లిగా ఆ భర్తని విశ్లేషించడంలో పడింది మీనా.

అతను ఆ అమ్మాయితో ఏ విషయాన్నీ షేర్ చేసుకోడట. ఏ విషయమూ ఫ్రాంక్‌గా మాట్లాడడట. ఎంత ముఖ్యమైన విషయమైనా రహస్యంగా అట్టేపెడతాడట. ఎంత సాధారణ విషయమైనా ఆ అమ్మాయికి చెప్పడానికి ఇష్టపడడట.

పెళ్ళయ్యి ఇన్నేళ్ళయినా... ఒక స్నేహితుడిలా కాదు, కనీసం పరిచయస్థుడిలా కూడా బిహేవ్ చేయడట.

అతనిపట్ల తనకున్న అసంతృప్తినంతా చెప్పింది ఆ అమ్మాయి.

మీనా కూడా అతని గురించి చాలా ప్రశ్నలు అడిగింది. అసలతను ఎందుకు కొడతాడు? ఎలా కొడతాడు? తరచూ కొడుతూంటాడా? కొట్టిన తర్వాత పశ్చాత్తాప పడతాడా?... వగైరా.

ఆ అమ్మాయి మళ్ళీ అదే చెప్పింది. అతనికి ఏ విషయమూ ఆమెతో చెప్పడం ఇష్టం వుండదుట. ఆమె ఒకటికి రెండుసార్లు ఏదన్నా అడిగితే కోపం వస్తుందట. చేయి చేసుకుంటాడట.

మీనా తల పంకిస్తూ వింటోంది.

ఆ అమ్మాయి అంతకుముందురోజు జరిగిన సంఘటన కథలా చెప్పడం మొదలు పెట్టింది.

భర్త ఆఫీస్‌నుండి ఇంటికి వస్తూండగా ఫోన్ చేసింది ఆమె. సరుకులు తీసుకురావాలని గుర్తు చేయబోతూండగానే "వచ్చేస్తున్నాను. వచ్చాక మాట్లాడు" అంటూ అతను ఫోన్ కట్ చేశాడు.

'వస్తూ వస్తూ తీసుకురావాల్సిన సరుకుల గురించి వచ్చేసిన తర్వాత ఏం మాట్లాడను!' అనుకుని... చేసేదేం లేక వూరుకుంది ఆమె.

కాసేపటికి అతను వచ్చాడు మరొకాయనతో కలిసి. ఆయన్ని హాల్లో కూర్చోబెట్టి, లోపలికి వచ్చి "కాఫీ తీసుకురా!" అన్నాడు.

"ఓహో! ఎవరితోనో కలిసి వచ్చారా! అందుకే ఫోన్ కట్ చేసేశారు కాబోలు!" అనుకుంది ఆమె.

భర్తని అర్థం చేసుకోనందుకు నొచ్చుకుంటూ "ఎవరండీ ఆయన!" అంది.

సమాధానం రాలేదు. వంటగది గుమ్మంలో నిలబడి ఫోన్‌లో ఏదో చెక్ చేసుకుంటూన్న అతను ఆ ప్రశ్న విన్నాడో లేదో అర్థం కాలేదు.

కాఫీ కప్పులు ట్రేలో సర్దుతూ "ఇద్దరూ కలిసే వచ్చారా? ఇందాక నేను ఫోన్ చేసినప్పుడు ఆయన కూడా వున్నారా?" అని మరో రెండు ప్రశ్నలు వేసిందామె.

అనాలోచితంగా ఆ రెండు ప్రశ్నలూ అడిగి తలెత్తి చూస్తే.. అతని కళ్ళల్లో అప్పటికే చిరాకు. బిగించిన పెదవులలో 'ఇన్ని ప్రశ్నలడుగుతావా?' అన్న అసహనం.

ఆ వచ్చినాయన కాఫీ తాగి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత... హాల్లో మరో వ్యక్తి కూర్చుని వుండగా... తనని వంటగది గుమ్మంలో నిలబెట్టి అన్ని ప్రశ్నలు వేసినందుకు ఆమెని నిలదీశాడతను.

"నేనడిగినదాంట్లో తప్పేముంది! ఇంటికి తీసుకువచ్చిన మనిషి ఎవరో నాకు తెలియాల్సిన అవసరం లేదా!" అని ఆమె కూడా ఎదురు చెప్పింది.

"నీకు చెప్పాల్సినంత విషయమేమీ అందులో లేద"న్నాడతను.

"ఎంత చిన్న విషయమైనా నాకు చెప్పచ్చు. నేను మీ పెళ్ళాన్ని" అంది ఆమె.

అతనో నాలుగు మాటలన్నాడు. ఆమె మరో నాలుగు మాటలంది. చివరికి ఆమె మీద అతను చేయి చేసుకోవడంతో ఆ సంఘటన ముగిసింది.

వింటుంటే ఆ అమ్మాయిమీద జాలేసింది నాకు. మీనా ఏం చెప్తుందోనన్న ఆసక్తి పెరిగింది.

ఏం సొల్యూషన్ చెప్తుంది దీనికి మీనా! అతను ఇలా ప్రవర్తించకుండా భార్యతో సామరస్యంగా వుండటానికీ, భార్యని భార్యలా చూసి అన్ని విషయాలూ షేర్ చేసుకొనేలా చెయ్యటానికీ ఏం కిటుకు వుంది మీనా దగ్గర... అని నేను ఆసక్తిగా చెవులు రిక్కించాను.

క్షణం నిశ్శబ్దం తర్వాత... మీనా గొంతు వినబడింది. "అతను కొట్టేంతవరకూ నువు వాదనని ఎందుకు పెంచావు?"

నేను వులిక్కిపడ్డాను. "అదేంటి పాపం! తప్పు ఆ అమ్మాయిదన్నట్లు అడుగుతోంది!" అనుకునే లోపూ...

ఆ అమ్మాయి వుక్రోషంగా చెప్పింది. "నేనేం వాదించలేదండీ. మొదట మామూలుగా అడిగాను. కానీ అంత చిన్న విషయాన్ని కూడా దాచిపెడుతుంటే.. నాకూ కోపం వచ్చింది. ఇంటికొచ్చిన మనిషెవరో నేను తెలుసుకోకూడదా చెప్పండి! అది కూడా తప్పేనా!" ఏడుపు దిగమింగుకుంటూ అడిగింది.

"తప్పు కాదు. తప్పు కాదు" అంది మీనా. "ఇందులో నీ తప్పేం లేదు. నువు చెప్తున్న దాన్నిబట్టి ఇందులో నీ తప్పేం లేదు. అతనికే ఏదో ప్రాబ్లం వుంది. కానీ అలా అడిగితే అతనికి కోపం వస్తుందని తెలిసినపుడు... ఫిజికల్ ఎటాక్ వరకూ రాకుండా నువు జాగ్రత్త పడాలి కదా..."

మీనా ఇంకా ఏదో చెప్తూండగానే.. ఆమె ఏడుపు ధ్వనిస్తూన్న గొంతుతో "ఇంత గొడవ చేశారు, కొట్టారు కానీ... ఆ వచ్చినాయనెవరో నాకు చెప్పనే లేదు" అంది.

ఆ మాటకి నాకు అప్రయత్నంగా నవ్వొచ్చింది. కానీ అంతలోనే ఆ మాటల వెనకవున్న ఆమె బాధ అర్థమై కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అతను కొట్టిన దెబ్బలకన్నా... అతను తనని అర్థం చేసుకోలేదన్న బాధ... తనని భార్యగా చూడడం లేదన్న బాధ ఆమెని తొలిచేయడంలోని విషాదం నా గుండెని సూటిగా తాకింది. ఆ తర్వాత... మీనా మాట్లాడుతున్న మాటలు నాకు అస్పష్టంగా వినిపిస్తూనే వున్నాయి.

కొట్టేదాకా ఎందుకు వాదించావు తో మొదలుపెట్టి.. మెల్లిగా అసలు నువు ఆ ప్రశ్నలు అతన్ని అడిగే వుండకూడదన్న వుపదేశం వైపు సాగుతోంది మీనా ధోరణి.

ఓ పక్క 'నీ తప్పేం లేదం'టూ ఆమెని బుజ్జగిస్తూనే... అన్ని విషయాలూ తెలుసుకునే హక్కు నీకుందంటూ ఆమెని సమర్థిస్తూనే....

అడిగితే దెబ్బలు తప్పవని తెలిసీ ప్రశ్నలు అడగడం తెలివి తక్కువ కదా అన్న విషయం ఆమెకి అర్థం చేసే ప్రయత్నం చేస్తోంది మీనా.

నా కళ్ళల్లోని తడి నాకు తెలీకుండానే కిందికి ధారగా జారసాగింది.

నిజమే. తెలివితక్కువే. అనుభవంనుంచి నేర్చుకోకపోవడం తెలివితక్కువే. జరగదని తెలిసిన విషయాన్ని మళ్ళీమళ్ళీ ఆశించడం... జరగాలని కోరుకోవడం తెలివితక్కువే.

"నవ్వుతూనే వచ్చి కాఫీ అడిగారు కదా అని నేనూ అడిగానండీ" అంటోందామె.

"వివరంగా చెప్తే అర్థం చేసుకుంటారేమో అని చెప్పానండీ..." అంటోంది.

సంజాయిషీ ధ్వనిస్తూన్న గొంతుతో ఇంకా ఏమిటేమిటో చెప్తోంది. మీనా అన్నిటినీ ఒప్పుకుంటూనే... నువు అలా ఆశించడం తప్పని నచ్చచెప్తోంది.

బలహీనంగా ధ్వనిస్తూన్న ఆమె గొంతూ... నచ్చ చెప్తూన్న మీనా గొంతూ వింటూంటే... నాకు మళ్ళీ మా చర్చ జరిగిన రోజు గుర్తొచ్చింది.

ఆ రోజు నేనూ ఇలాగే... ఆ అమ్మాయిలానే మాట్లాడాను. అందరూ రామనాథం క్యారెక్టర్ చాలా సహజంగా వుందని నచ్చచెప్తుంటే.. నేను మాత్రం... అదికాదండీ!... ఇది కాదండీ అంటూ ఏదేదో చెప్పబోయాను.

"ఈ మధ్య కొంచెం బానేవుంటున్నారండీ అందుకే... ఏమైనా అర్థం చేసుకుంటారేమోననుకుని..." దుఃఖాన్ని దిగమింగుతూ చెప్తోందామె.

తన అత్యాశకు తానే సిగ్గుతో చితికిపోతూ చెప్తోంది.

'అందరూ తలా ఒక లడ్డూ తీసుకోండర్రా' అని చెప్తే, రెండు లడ్డూలు తీసుకుంటూ టీచర్‌కి దొరికిపోయిన స్కూల్ పిల్లాడిలా సంజాయిషీ ఇస్తోంది.

అవును! ఎంత ఆశ!

ఆ రోజు చర్చలో నా కళ్ళు మూసుకుపోవడానికి కారణం కూడా ఈ ఆశే.

అందరికీ అంత సులభంగా అర్థమయిన విషయం నాకు వారం రోజులుగా అర్థం కాకపోవడానికి కారణం ఈ ఆశే.

దుఃఖంతో వణుకుతున్న ఆమె గొంతు వింటూ నేను నిర్వేదంగా నవ్వుకున్నాను.

ఈ సంఘటన నాకో పెద్ద పాఠం.

అన్ని బాధలకీ కారణం కోరికలేనన్న విషయం నేను చాలా రోజుల క్రితమే తెలుసుకున్నా ననుకున్నాను.

కోరికలని అదుపులో పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నాననీ... చాలావరకూ జయిస్తున్నాననీ కొన్ని రోజులుగా గర్వపడుతున్నాను.

కొత్త కోరికలు పుట్టకుండా జాగ్రత్త పడుతున్నాననీ... పాత కోరికలని చాలావరకూ చంపేసుకున్నాననీ అనుకున్నాను.

కానీ 'కోరిక' అనే మాటకి వున్న విశ్వరూపాన్ని నేను ఇవాళే దర్శించాను.

ఎందుకు లేవు నాకు కోర్కెలు! ఎందుకు లేవు నాలో ఆశలు! ఒక అసాధారణ వ్యక్తిత్వం కనబడగానే అతను అంతే అసాధారణంగా భార్యతోనూ ప్రవర్తించాలని కోరుకున్నాను. అందర్నీ అర్థం చేసుకొన ప్రయత్నించే మహానుభావుడు కనబడగానే ఆయన భార్యనీ అర్థం చేసుకోవాలని ఆశించాను.

మిగిలినవాళ్ళు చదివీ, చూసీ తెలుసుకోగలిగిన విషయాన్ని నేను స్వయంగా అనుభవించీ తెలుసుకోలేకపోవడానికి కారణం ఇదే... ఆశ.

కోరికలు, ఎక్స్‌పెక్టేషన్స్ వున్నంతకాలం అనుభవమూ, పాండిత్యమూ పనిచేయవు. ఆశ వున్నచోట అవి నిర్వీర్యమవుతాయి. వాటిల్లో నుంచి జ్ఞానం పుట్టదు.

అవును. ఒక విషయానికి స్పందిస్తూన్నంత కాలం దాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకోలేం. స్థితప్రజ్ఞత అలవడ్డానికే నిజమైన జ్ఞానం చేతి కందుతుంది.

నేర్చుకున్న పాఠాన్ని నెమరు వేసుకుంటూ కూర్చున్న నేను ఆ అమ్మాయిని పంపించి మీనా ఎప్పుడు నా దగ్గరికి వచ్చిందో గమనించలేదు. అప్పటికి ఎన్నిసార్లు పిల్చిందో కానీ... నన్ను గట్టిగా కుదుపుతూ "ఏవిటే పలకవు! అలా బుద్ధావతారంలా కూర్చున్నావేమిటి?" అంది.

నేను తల తిప్పి తనవైపు చూశాను.

"ఏమయింది!" అంది మీనా నా వైపు ఆశ్చర్యంగా చూస్తూ.

నేను నవ్వాను. 'జ్ఞానోదయం' అంటూ లేచి నిలబడ్డాను.

<u>రచనాకాలం : 2009</u>